క్లుప్తంగా

నేడు సెమీ క్రిస్మస్ వేడుకలు

సత్తెనపల్లి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం రాత్రి 8 గంటలకు సెమీ క్రిస్మస్ వేడుకలు -2024 జరుగుతాయని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ నాయకులు సోమవారం తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీ నారాయణ హాజరవుతారన్నారని, షెకీనా ప్రార్థన మందిరం రెవ వి.జయరాజు క్రిస్మస్ సందేశం అందిస్తారని పేర్కొన్నారు. క్రిస్మస్ కేక్ కటింగ్, క్యాండిల్ సర్వీస్, లక్కీ డీప్ వంటి కార్యక్రమాలు జరుగుతాయని, అనంతరం ప్రేమ విందు ఉంటుందన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సహోదరి, సహోదరులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆశ్రమ పాఠశాలలో అన్నదానం



సత్తెనపల్లి: పుట్టకతోనే చెవిటి, మూగ, మానసిక వైకల్యంతో జన్మించిన చిన్నారులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు, సీనియర్ న్యాయవాది పక్కాల సూరిబాబు అన్నారు. పట్టణంలోని పరివర్తన చెవిటి, మూగ, మానసిక దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలలో సోమవారం వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్ జన్మదినం సందర్భంగా అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేక్ కట్ చేసి అచ్యుత శివప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు కూకుట్ల శ్రీనివాసరావు, శెట్టి ఆనంద్, వరికల్లు కోటేశ్వర రావు, షేక్ మొహమ్మద్ గని, తిరుమల, కళ్యాణ్, సాయి, కాటుమాల డేవిడ్ ఉన్నారు.

ఎలుకల నివారణపై అవగాహన



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా ఎలుకల నివారణపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎలుకల వల్ల పంటకు కలిగే నష్టాలను, నివారణ చర్యలను చార్ట్‌ల రూపంలోఎన్ఎస్ఎస్ అధికారులైన డాక్టర్ సి.సంధ్యారాణి, డాక్టర్ జి.విజయ్‌కుమార్ రైతులకు వివరించారు. బకెట్ ట్రాప్ నమూనాను వరి పొలంలో పెట్టి ఎలుకలను ఎలా నివారించవచ్చనే విషయాన్ని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాతులూరు, మాదల, నార్నెపాడు, చాగంటివారి పాలెం గ్రామాల నుంచి వచ్చిన ఎన్ఎస్ఎస్ వలంటీర్‌లైన వ్యవసాయ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

రాజుపాలెం: బ్రాహ్మణపల్లిలోని యూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో-2 నరసింహారావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు. తాగునీటి సమస్య లేకుండా మినరల్ వాటర్‌ను వినియోగించాలని స్పష్టం చేశారు. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ప్రారంభం

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామం వద్ద శ్రీసాయి పెయింట్స్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ను సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు లు సోమవారం ప్రారంభించారు. సత్తెనపల్లి-నరసరావుపేట ప్రధాన రహదారి వెంబడి నూతనంగా ప్రారంభించిన యూనిట్ వివరాలు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు గింజుపల్లిలో రెవెన్యూ సదుస్సు

అచ్చంపేట: మండలంలోని జింజుపల్లిలో మంగవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సదుస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ తెలిపారు. రెవెన్యూకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన గ్రామస్తులకు ఒక ప్రకటనలో సూచించారు.

ఇరు కుటుంబాల ఘర్షణ

మాదల(ముప్పాళ్ళ): మాదల గ్రామంలోని ముస్లిం కాలనీలో సోమవారం రెండు కుటుంబాల మధ్య వివాదం ఘర్షణకు దారితీసింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ముస్లిం కాలనీకి చెందిన షేక్ జానీ, షేక్ మస్తాన్ వలి అనే కౌలు రైతులు పొలం వద్ద గట్టు విషయంలో వివాదం జరిగింది. ఈ వివాదం ముదిరి రెండు కుటుంబాల మధ్య ఘర్షణకు దారితీసింది. రెండు గృహాలు ఎదురెదురుగా ఉండటంతో ఇరు కుటుంబాల వారు రాళ్లతో, సోడా సీసాలతోను పరస్పరం దాడులు చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, ఘర్షణ ను అడ్డుకొని రెండు కుటుంబాలకు చెందిన వారిని అదుపులోకి తీసుకున్నారు.

భౌ.. భౌ..!

- శునకాల స్వైర విహారంతో ప్రజల బెంబేలు
- పెరిగిపోతున్న కుక్కకాటు కేసులు
- వీధికుక్కల శస్త్ర చికిత్సలో తాత్సారం



రఘురామ్ నగర్‌లో ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లేదారిలో వీధి కుక్కలు

సత్తెనపల్లి: పట్టణంతో పాటు శివారు ప్రాంతాల్లో వీధి కుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇళ్లల్లోకి చొరబడి మనుషులపై దాడి చేస్తున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, మహిళలు రోడ్డుపై నడిచి వెళ్లాలంటేనే వణికి పోతున్నారు. సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో కుక్కల బెడద నుంచి రక్షించుకోవడానికి తగు చర్యలు తీసుకోవాలి.

శస్త్ర చికిత్సల కథ కంచికేనా..!

కుక్కలు మనుషులను కరవడం ద్వారా ప్రమాదకరమైన రేబిస్ వ్యాధి ప్రబలుతోంది. వీధి కుక్కల సంతతిని అరికట్టడంతో పాటు రేబిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాల్సి ఉన్నా.. ఈ దిశగా చర్యలు లేవు. కుక్కల బెడదను అరికట్టేందుకు వాటికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయాలి. ఈ విధానం పూర్తిస్థాయిలో అమలు చేయడంలో అధికారులు విఫలం అవుతున్నారు.

కుక్క కాటేస్తే తీసుకోవాల్సిన చర్యలు...

కుక్క కరిచిన చోట కొళాయి లేదా చెంబుతో నీటిదార పోస్తూ సబ్బుతో పది నిమిషాలు కడగాలి. లైఫ్ బాయ్ సబ్బు అయితే మంచిది. డెటాల్ లేదా గడ్డం గీసుకున్న తర్వాత వాడే లోషన్ పూయాలి. వీలైనంత త్వరగా వైద్యుల్ని సంప్రదించాలి. పిచ్చి కుక్క అయితే వెంటనే రేబిస్ టీకాలు వేయించాలి. గాయాన్ని రుద్ది కడగరాదు. గాయంపై టింక్చర్ అయోడిన్ వేయకూడదు. గాయానికి కట్టు కట్టడం, గట్టిగా నొక్కడం చేయ రాదు.

పెరుగుతున్న పెంపుడు కుక్కల పెంపకం...

నేడు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ పెంపుడు కుక్కల పెంపకం ఎక్కువగా ఉంది. ప్రధానంగా ఇంటికి రక్షణ కోసం మేలు జాతి కుక్కలను పోషిస్తున్నారు. కొంత మందికి కుక్కల పెంపకం హాబీగా మారింది. వీటికి తప్పనిసరిగా మూడు నెలల వయసులో టీకాతో పాటు ఏటా బూస్టర్ డోస్ వేయించాలి. పెంపుడు కుక్కలకు విధిగా సంతాన నియంత్రణ చికిత్సలు చేయించాలి.

కుక్క కాటు నుంచి ఇలా తప్పించుకోవచ్చు...

కుక్క దగ్గరికి వస్తే ఏమాత్రం కదలకుండా నిలబడి ఉండడం ఉత్తమం. ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగెత్తకూడదు. కుక్కల కళ్లల్లోకి తదేకంగా చూడకూడదు. కుక్కపిల్లల దగ్గరికి వెళ్లకూడదు. తల్లి కుక్క దాడి చేసే ప్రమాదం ఉంటుంది. నిద్రిస్తున్నప్పుడు, తింటున్నప్పుడు, పిల్లలకు పాలిస్తున్నప్పుడు కుక్కలను కర్రలు, రాళ్లతో అదిలించడం వంటివి చేయకూడదు. కుక్క దాడి చేస్తే ముఖాన్ని పంచే లేదా తువాలు వంటి వాటితో కప్పు కోవాలి. ఏమీ లేకపోతే చొక్కాను పైకి జరుపుకోవాలి లేదా ముఖాన్ని చేతులతో కప్పుకోవాలి. ముఖాన్ని కరిస్తే ఇన్ఫెక్షన్ త్వరగా మెదడుకు సోకుతుంది.

చేయకూడనివి...

మిగిలిపోయిన ఆహారం, ఎముకలు వంటివి ఎక్కడపడితే అక్కడ వేయరాదు. తిండి దొరికినంత కాలం వీధుల్లో కుక్కలు సంతానం వృద్ధి చెందుతూనే ఉంటుంది. పెంపుడు కుక్కలను వీధుల్లోకి వదలకూడదు. వీధి కుక్కలతో పెంపుడు కుక్కలను కలవనియకూడదు. పెంపుడు కుక్కలను ఇళ్లల్లో ఎల్లప్పుడూ కట్టి ఉంచకూడదు. దీనివల్ల వాటిలో ఆగ్రహం పెరుగుతుంది. వీధి కుక్కలు వెంబడించినప్పుడు బైకు, సైకిల్ వేగం పెంచకూడదు.



పట్టణంలోని ప్రధాన రహదారిలో శరభయ్య హైస్కూల్ వద్ద వీధి కుక్కలు

గ్రామీణ ప్రాంతాల్లో చైతన్య గోదావరి బ్యాంక్ సేవలు



నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఆర్ఎం వర్ల శ్రీనివాస్, జీఎం పీవీ రెడ్డి

పెదకూరపాడు : ఖాతాదారులకు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మెరుగైన సేవలు అందిస్తుందని సీజీబీ చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని 75త్యాళ్ళూరులో సోమవారం నూతనంగా బ్యాంకు శాఖను ఆర్ఎం వర్ల శ్రీనివాసు, జీఎం పి.వి.రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. చైర్మన్ మాట్లాడుతూ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు పూర్తిగా ప్రభుత్వరంగ సంస్థ అని, ఖాతాదారులకు, వ్యవసాయ ఆధారిత రుణాలు, వ్యాపార, వ్యక్తిగత, విశ్వకర్మ, భూమి కొనుగోలుకు రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. డిపాజిట్ దారులకు అత్యధికంగా సీనియర్ సిటిజన్లకు 8.5 శాతం, మిగతావారికి 8.1శాతం వడ్డీ చెల్లిస్తున్నామని తెలిపారు. నూతన సంవత్సరం నుండి ఎన్నారై ఖాతాలు, మొబైల్ బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఎపూరి అయ్యప్ప, రిటైర్డు ఆర్ఎం శ్రీనివాస రెడ్డి, పరిసర గ్రామాల ప్రజలు, మహిళలు, ఖాతాదారులు పాల్గొన్నారు.

క్రోసూరు వరకు బస్సులు నడపాలి



తహసీల్దార్ దానియల్‌కు వినతపత్రం అందిస్తున్న ప్రయాణికులు

పెదకూరపాడు: గుంటూరు నుంచి పెదకూరపాడు గ్రామం మీదుగా క్రోసూరు వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులను నడపాలని పెదకూరపాడు అభ్యుదయ వేదిక కన్వీనర్ దర్శి శేషారావు కోరారు. సోమవారం పెదకూరపాడు తహసీల్దార్ దానియేలుకు ఆర్టీసీ సర్వీసులు పెంచాలని వినితిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గుంటూరు నుంచి పెదకూరపాడు మీదుగా గారపాడు వరకు బస్సులు నడుస్తున్నాయన్నారు. ఆ బస్సులను క్రోసూరు వరకు పొడిగించాలన్నారు. పొడిగించడం వల్ల నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడుకు, క్రోసూరు, అచ్చంపేట ప్రాంత ప్రజలకు ప్రయాణ మార్గం సుగమనం అవుతుంది. ఆ ప్రాంత ప్రజలు గుంటూరు వెళ్లటానికి దూరం కూడా తగ్గుతుందన్నారు. పొడిగించడం సాధ్యం కాకపోతే ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయాలన్నారు. అలానే గుంటూరు నుండి పెదకూరపాడుకు ఎక్స్‌ప్రెస్ బస్సులను నడపాలని కోరారు. ప్రతినిధులు ఎం.మస్తానరావు, సీహెచ్ అంకమ్మ, పి.శ్రీనివాసరావు, డి.సురేష్, రాజేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప భక్తుడి దుర్మరణం



మృతుడు కోటిరెడ్డి

పెదకూరపాడు: అయ్యప్ప స్వామి పడి పూజ భజన ఏర్పాట్లను పర్యవేక్షించి, స్వగ్రామం వస్తున్న అయ్యప్ప మాలదారుని లారీ రూపంలో మృత్యువు వెంటాడింది. ఈ ఘటన మండలంలోని పరస-75త్యాళ్లూరు గ్రామాల మధ్య మైత్రీ వనం సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. 75త్యాల్లూరుకు చెందిన వజ్రాల కోటిరెడ్డి (38) రియల్ ఎస్టేట్ సంస్థలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. కంభంపాడు గ్రామంలో పడి పూజ భజన పనులు పర్యవేక్షించి, తిరిగి తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామం బయలుదేరాడు. గ్రామ సమీపంలోని మైత్రివనం వద్దకు వచ్చిన క్రమంలో వెనుక నుండి వస్తున్న ఒక సబ్బుల కంపెనీకి చెందిన లారీ కోటిరెడ్డి దిచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో కిందపడిపోయిన కోటిరెడ్డిపై వెనుక లారీ టైర్లు ఎక్కడంతో తల చిద్రమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. లారీ డ్రైవర్ వాహనం నిలపకుండా వెళ్లడంతో స్థానికులు వెంబడించి పెదకూరపాడు గ్రామంలో వాహనాన్ని అడ్డుకొన్నారు. పెదకూరపాడు పోలీసే స్టేషన్‌కు తరలించారు. మృతుడికి భార్య శ్రీలత, కౌశికెడ్డి, సుస్మితసాయి సంతానం. కుటుంబ ఆధారం కోల్పాయామంటూ మృతుడి భార్య కన్నీటి పర్యంతమయ్యారు. ఎస్సై గిరిబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమరావతి కమ్యూనిటీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కిచెన్ గార్డెన్‌పై అవగాహన



కూరగాయలు అందిస్తున్న నవీన్, సంధ్యారాణి

ముప్పాళ్ళ: మండలంలోని చాగంటివారిపాలెం ఆర్బీకేలో ప్రకృతి వ్యవసాయం విధానంలో భాగంగా కిచెన్ గార్డెన్‌పై రైతులకు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి నవీన్ పాల్గొని, కిచెన్ గార్డెన్ తయారీ, కూరగాయల పెంపకం, జీవామృతం, ఘన జీవామృతంపై మహిళలకు అవగాహన కల్పించారు. కిచెన్ గార్డెన్ ద్వారా ఆరోగ్య కరమైన కూరగాయలను, ఆకు కూరలను పెంచుకోవవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా నార్నెపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఆకుకూరలు, కూరగాయలతో స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయకళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జి.విజయ్‌కుమార్, డాక్టర్ సంధ్యారాణి, ప్రకృతి వ్యవసాయం నార్నెపాడు యూనిట్ ఇన్‌చార్జ్ కె.పూజ, కె.సౌజన్య, బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు..



పెదకూరపాడు : మండల కేంద్రంలోని జీఆర్‌సీ ఆర్కే శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో గుత్తా రత్నచంద్ర రామకోటేశ్వరి మెమోరియల్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు మంగళ, బుధ వారాల్లో జరుగుతాయని జీఆర్‌సీ ఆర్కే స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులు గుత్తా కవితా రాము సోమవారం తెలిపారు. పలు మెమోరిల్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. విజేతలకు నగదు, ప్రోత్సాహక బహుమతులను అందించనున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఈ పోటీలను ప్రారంభించనున్నారు.

పోలీస్ వ్యవస్థపై నమ్మకం కలిగించాలి

- గురజాల డీఎస్పీ జగదీష్
- రెంటచింతల పీఎస్‌లో ఆకస్మిక తనిఖీ



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న గురజాల డీఎస్పీ జగదీష్

రెంటచింతల: శాంతిభద్రతల నిర్వహణలో జవాబుదారీగా ఉంటూ పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలని గురజాల డీఎస్పీ జగదీష్ అన్నారు. సోమవారం ఆయన రెంటచింతల పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలించి సుమారు 8 గంటల పాటు వివిధ గ్రామాలకు సంబంధించిన కేసుల రికార్డులను తనిఖీ చేసి మాట్లాడారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని ఎవరూ అతీతులు కారని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారిని మర్యాదగా పలకరించి బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించాలన్నారు. స్టేషన్‌లో ఉన్న పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామం ప్రశాంతంగా ఉండటానికి ప్రజలు పోలీసులకు సహకరించాన్నారు. గ్రామాలలో పొలం తగాదాలు, నగదు వివాదాలు, ఆస్తి పంపకాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఎవరికైన సమస్యలు ఉంటే ముందుగానే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. కోర్టులలో వివాదాలు పెండింగ్‌లలో ఉన్న సమయంలో పరిష్కారం వచ్చేవరకు ఓపికగా ఉండాలన్నారు. గ్రామాలలో ప్రశాంత వాతావరణానికి ప్రజలందరూ సహకరించాలన్నారు. తొలుత వివిధ కేసులలో స్వాధీనం చేసుకున్న, పలు ప్రమాదాల వలన స్టేషన్‌కు తీసుకువచ్చిన వాహనాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట కారంపూడి సీఐ శ్రీనివాసరావు, రెంటచింతల ఎస్ఐ సీహెచ్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ధర్మ ప్రచారం



ధర్మ ప్రచారం నిర్వహిస్తున్న సభ్యులు

అమరావతి: త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల హిందూ ధర్మ ప్రచారం సోమవారం నిర్వహించారు. ధరణికోట గ్రామంలో శ్రీకృష్ణ భగవానుడి సర్వ మానవళి అందించిన సందేశాలను ప్రతి ఒక్కరికి అందేలా ప్రచారం చేస్తున్నా మని త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి-హిందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు తెలిపారు. శ్రీకృష్ణుడు ప్రపంచానికి అందించిన జ్ఞాన సంపద అందరికి ఎరుకపరుచుటకు ప్రతి గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రబోధసేవా సమితి సభ్యులు కృష్ణారావు, శివలింగంనాయక్, బ్రహ్మం, పట్టాభి, శ్రీను, హరిబాబు, సుబ్బారావు, గోపి, సుధాకర్, దిల్‌షా, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



పెదకూరపాడు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ యువకుడు సోమవారం మృతి చెందాడు. పాటిబండ్ల గ్రామానికి చెందిన షేక్ ఖాజా మొహిద్దీన్ సత్తనపల్లిలో నివాసం ఉంటూ పాటిబండ్లలో ఉన్న తల్లిని చూసేందుకు వచ్చి తిరిగి వెళుతూ ఆదివారం పెదకూరపాడులో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఖాజామొహిద్దిన్ మృతి చెందినట్లు ఎస్సై గిరిబాబు తెలిపారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని డిపో మేనేజర్ బి.కోటేశ్వరరావు నాయక్ ఆధ్వర్యంలో డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ బి.కోటేశ్వరరావు నాయక్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గతంలో మిర్యాల గ్రామ ప్రజలు బస్సును నడపాలని కోరగా.. 10వ తేదీ ఉదయం 6.45 గంటల నుంచి నడపటం జరుగుతుందని తెలియజేశారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్ సిబ్బంది



కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

పెదకూరపాడు: బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ సిబ్బంది అడ్డుకొన్నారు. ఈ ఘటన మండలంలోని తమ్మవరం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. అంగన్‌వాడీ సిబ్బంది వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కుమార్తెకు మైనార్టీ తీర లేదు. ఆ బాలికకు అదే గ్రామానికి చెందిన గుడేటి ఏసురత్నం కుమారుడు, మైనర్‌తో వివాహం జరుగుతుందని తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, పోలీసులు వెళ్లి ఇరు కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లకు వివాహం చేయడం చట్ట రిత్యా నేరమని, వివాహం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో వివాహాన్ని నిలిపివేస్తామని ఇరు కుటుంబాల వారి నుంచి రాతపూర్వకంగా లేఖ రాయించారు.

12న మున్సిపల్ కార్యాలయం ముట్టడి

వలంటీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హుమయూన్ బాషా

పిడుగురాళ్ల: వలంటీర్ల సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 12వ తేదీన పిడుగురాళ్ల పట్టణంలో మున్సిపల్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ వలంటీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హుమయూన్ బాషా పిలుపునిచ్చారు. సోమవారం పిడుగురాళ్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలోని మున్సిపాలిటీలోని రాజీనామా చేసిన, రాజీనామా చేయని వలంటీర్లందరూ ముట్టడిలో పాల్గొన్నాలన్నారు. ఐలాండ్ సెంటర్ నుంచి భారీర్యాలీతో మున్సిపల్ కార్యాలయం వద్దకు వెళ్లి వలంటీర్ల సమస్యలపై గళమెత్తాలన్నారు. ప్రతి ఒక్క వలంటీర్ భారీ ర్యాలీలో, మున్సిపల్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం ఉపాధ్యక్షుడు గౌస్ పాల్గొన్నారు.

14న నీటి సంఘాల ఎన్నికలు



సాగర్‌కాలువ

క్రోసూరు: స్థానిక సాగర్ కెనాల్స్ పరిధిలోని 96 టీసీలతో ఈ నెల 14న నీటి సంఘాల ఎన్నికలు జరగనున్నాయని క్రోసూరు కెనాల్స్ ఏఈ బండి శ్రీనివాసరావు తెలిపారు. క్రోసూరు కెనాల్స్ పరిధిలోని ఎనిమిది వాటర్ యూజర్స్ అసోసియేషన్ల(డబ్ల్యూఏ) కింద ఒక్కోదానికి 12 టీసీలున్నాయి. అవి వరసగా దొడ్లేరు(63వ నెంబర్ డబ్ల్యూఏ)-12 టీసీలు, అదేవిధంగా ఉయ్యందన(64)కి 12టీసీలు, ఉయ్యందన(డైవర్షన్ ఛానల్) (65)- 12 టీసీలు, మిట్టపాలెం (66)-12 టీసీలు, వేల్పూరు(67)-12టీసీలు, వేల్పూరు-2(68) కి 12 టీసీలు, ఊటుకూరు(69) -12 టీసీలు, ఊటుకూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు (70)కు 12 టీసీలున్నాయి. ఈ విధంగా ఎనిమిది డబ్ల్యూఏలకు చెందిన మొత్తం 96 టీసీలు డబ్ల్యూఏ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు డిస్ట్రిబ్యూటరీ(డీసీ)అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోవటం జరుగుతుంది. ప్రతి టీసీకి సుమారుగా 80 నుంచి 125 మంది ఆయకట్టు రైతులు ఓటర్లుంటారని ఏఈ వివరించారు.

గ్రామల్లో క్రిస్మస్ సందడి



బెల్లంకొండ: మండలంలోని గ్రామాల్లో క్రిస్టమస్ పండగ సందడి ప్రారంభమైంది. డిసెంబర్ 25న లోకరక్షకుడైన ఏసుక్రీస్తు జన్మించిన రోజు కావడంతో నెల ప్రారంభం నుంచి క్రిస్మస్ స్టార్‌లు ఏర్పాటు చేస్తున్నారు. పాపాయపాలెం, బెల్లంకొండ, మన్నెసుల్తాన్‌పాలెం, నందిరాజుపాలెం, చంద్రాజుపాలెం, మచాయపాలెం, వెంకటాయపాలెం గ్రామాల్లో పెద్ద ఎత్తున్న స్టార్‌లను ఏర్పాటు చేశారు. పండుగ పదిహేను రోజుల ముందు నుంచే చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

చేనేత, హస్తకళలను ప్రోత్సహిద్దాం

చేనేత హస్తకళా మేళాను ప్రారంభించిన సీఐ భాస్కర్



చేనేత హస్తకళా మేళాను ప్రారంభిస్తున్న సీఐ

గురజాల: చేనేత హస్తకళలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని సీఐ భాస్కర్ అన్నారు. స్థానిక శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో సోమవారం గ్రామీణ వీవర్స్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో చేనేత హస్తకళా మేళా ప్రదర్శనను సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఒకే ప్రాంతంలో అన్ని రకాల వస్తువులు ఏర్పాటుచేయడం శుభ పరిణామమన్నారు. కొండపల్లి, ఏటికొప్పాక చెక్క బొమ్మలు, ముత్యాలు, 1 గ్రామ్ గోల్డు జ్యుయలరీతో పాటు చిన్నారుల ఆటవస్తువులు, పోచంపల్లి, మంగళగిరి, చీరాల, డ్రెస్ మెటీరీయల్స్ వంటివి ఒక ప్రాంతంలో లభించే విధంగా ఏర్పాటుచేసిన సొసైటీకి అభినందనలు తెలిపారు. ఎస్ఐ వై.వినోద్‌కుమార్, నిర్వహకులు రంగస్వామి, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ' పోస్టర్ల ఆవిష్కరణ



క్రోసూరు: రాష్ట్ర సీపీఎస్ఈఏ పిలుపు మేరకు మంగళవారం సీపీఎస్ రద్దు కోసం మంగళవారం ఉద్యోగులు తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని క్రోసూరు శాఖ ఉపాధ్యాయులు వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. స్థానిక జెడ్పీ పాఠశాల ఆవరణలో ఉద్యోగులు మాట్లాడుతూ ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం డిసెంబర్ 10న సీపీఎస్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ సీపీఎస్ రద్దు కోరుతూ పాత పెన్షన్ హక్కు కొరకు చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టినట్లు తెలిపారు. కావున చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలూరి పిచ్చయ్య, సురేష్ బాబు, శ్రీధర్, ఇషాక్, శారద, లక్ష్మీ, సామ్రాజ్యం, శ్రీహరి, శ్రీనాథ్ చంద్రశేఖర్ రెడ్డి, లీల పాల్గొన్నారు.